# 'గృహలక్ష్మి' సంబురం..

- సొంతింటి కల నెరవేరుతున్న వేళ
- సీఎం కేసీఆర్ కృషి ఫలితం



మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నుంచి గృహలక్ష్మి అర్హత పత్రాన్ని అందుకుంటున్న మహిళ (ఫైల్)

సోన్, అక్టోబర్ 4 : ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో సర్కారు ప్రతిష్ఠాత్మకంగా 'గృహలక్ష్మి' పథకాన్ని చేపట్టింది. పేద కుటుంబాల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపుతున్నారు. ఇదే క్రమంలో నిర్మల్ మండలంలోని పలు గ్రామాలకు ఇటీవల గృహలక్ష్మి పథకం కింద 320 కుటుంబాలకు అనుమతి పత్రాలను అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి లబ్ధిదారులకు అందించారు. దీంతో గృహ నిర్మాణం కలను నెరవేర్చుకోవడానికి ఆయా లబ్ధిదారులు పనులకు శ్రీకారం చుట్టారు.

**ప్రతిష్ఠాత్మకంగా గృహలక్ష్మి..**

కేసీఆర్ ప్రభుత్వం ఇప్పటికే అనేక మందికి డబుల్‌బెడ్రూం ఇండ్లను నిర్మించి అందించారు. రూపాయి ఖర్చు లేకుండా సకల హంగులతో నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఆ ఇండ్లలో లబ్ధిదారుల కుటుంబాల్లో నివాసం ఉంటున్నాయి. ఇదే క్రమంలో సొంత ఇంటి జాగా కలిగి ఉన్న మరిన్ని కుటుంబాలకు రూ. 3 లక్షల సాయం చేసేందుకు గృహలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే నిర్మల్ మండలంలోని దాదాపు 1100 కుటుంబాలను అర్హులుగా గుర్తించారు. ఇటీవల 320 మందికి గృహ నిర్మాణం కోసం లబ్ధిదారులకు అనుమతి పత్రాలను అందించారు. దీంతో వారు సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద రూ. 3లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తారు. మొదటగా గృహ నిర్మాణ ప్రారంభ దశలో రూ. లక్ష అందిస్తారు. అనంతరం ఇంటి స్లాబ్ నిర్మాణ సమయంలో లబ్ధిదారులకు మరో రూ. లక్షను ఇవ్వనున్నారు. పనులు పూర్తయి గృహ ప్రవేశం సందర్భంలో రూ. లక్ష అందిస్తారు.

**లబ్ధిదారుల కళ్లలో ఆనందం..**

గృహలక్ష్మి పథకంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి పథకం చేపట్టలేదు. పురిగుడిసె, పెంకుటిల్లు, రేకుల ఇల్లు వంటి వాటిల్లో వర్షాకాలం వచ్చిందంటే చాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పక్కా ఇల్లు లేక అద్దె ఇంట్లో నివాస ముంటూ సతమతమయ్యేవారు. ఇలాంటి కుటుంబాలను ప్రభుత్వం ఎంపిక చేసి ఇల్లు కట్టుకునేందుకు సాయం చేయడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు.

**అప్పుడు డబుల్ బెడ్రూం ఇండ్లు..**
**ఇప్పుడు గృహలక్ష్మి..**

నిర్మల్ మండలం చిట్యాల్‌లోని 90 డబుల్ బెడ్రూం కట్టింటి లబ్ధిదారులకు ఇచ్చారు. డ్యాంగాపూర్‌లో 50, రత్నాపూర్‌కాండ్లీలో 50 ఇండ్లను నిర్మించి అందించారు. ఒక హాలుతో పాటు కిచెన్, రెండు బెడ్రూంతో పాటు బాత్‌రూంను నిర్మించి లబ్ధిదారులకు అందించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ సొంత జాగా ఉన్న వారికి రూ. 3 లక్షలను సాయం చేయనున్నారు.

**సంతోషంగా ఉంది..**



మాది నిర్మల్ మండలం డ్యాంగాపూర్ గ్రామం. మాకు పూరి గుడిసె ఉంది. వర్షాకాలం వచ్చిందంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. అయితే సీఎం కేసీఆర్ సార్ గృహలక్ష్మి కింద ఇల్లుకు పైసలు ఇస్తారని చెప్పారు. దరఖాస్తు పెట్టినా దానికి మొన్న నాకు ఇల్లు కట్టుకునేందుకు పత్రాలు ఇచ్చారు. మంచిగా రూ. 3లక్షలతో నా జాగాలో ఇల్లు కట్టుకుంటా. సంతోషంగా ఉంది. సొంతింటి కల నిజమవుతున్నది.

- తలారి సాయవ్వ, డ్యాంగాపూర్(నిర్మల్ మండలం)

**కిరాయి బాధ తప్పతుంది..**



నాకు ఇది వరకు ఇల్లు లేదు. అద్దె ఇంట్లో ఉంటున్నాం. సీఎం కేసీఆర్ గృహలక్ష్మి పథకం తీసుకొచ్చి మంచి పని చేసిన్రు. మాలాంటి వారికి ఈ పథకం ద్వారా సొంతింటి కలను నెరవేర్చుకోవచ్చు. కిరాయి బాధ తప్పుతుంది. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నుంచి ఇంటి నిర్మాణం కోసం అర్హత పత్రం తీసుకున్నా. మంచిగా రూ. 3లక్షలతో ఇల్లు కట్టుకుంటా. సొంతింటి కలను నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉంది.

- సాద జయశీల, వెంగ్వాపేట్(నిర్మల్ మండలం)



లక్ష్మణచాంద : కేటీఆర్ సభకు తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## కేటీఆర్ సభకు తరలిన నాయకులు

లక్ష్మణచాంద, అక్టోబర్ 4 : నిర్మల్ జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన మంత్రి కేటీఆర్ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. మండల బీఆర్‌ఎస్ కన్వీనర్ కొరిపెల్లి కృష్ణారెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు సమావేశానికి తరలి వెళ్లాయి.



నర్సాపూర్(జీ) : కేటీఆర్ సభకు తరలి వెళ్తున్న నాయకులు

**నర్సాపూర్(జీ)లో..**

నర్సాపూర్(జీ), అక్టోబర్ 4 : జిల్లా కేంద్రంలో మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## బతుకమ్మ చీరెల పంపిణీ



బతుకమ్మ చీరెలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాంరెడ్డి, అధికారులు

నర్సాపూర్(జీ), అక్టోబర్ 4 : మండలంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం బతుకమ్మ చీరెలను సర్పంచ్ రాంరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం సునంద మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆడబిడ్డల కోసం దసరా కానుకగా రంగు రంగుల బతుకమ్మ చీరెలను అందిస్తున్నదని పేర్కొన్నారు. జడ్పీటీసీ చిన్న రామయ్య, ఎంపీటీసీ మల్లేశ్, సర్పంచ్ రాంరెడ్డి, బర్కుంట గంగారాం, మహేందర్, శంకర్, రాజు, బర్కుంట రాము, శ్రీధర్, రవి పాల్గొన్నారు.

## జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ఉపాధ్యాయులు

సోన్, అక్టోబర్ 4 : మండల కేంద్రంలోని అభ్యాస గురుకులం పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్ తెలిపారు. సెప్టెంబర్ 10, 11 తేదీల్లో నిర్వహించిన 7 బ్లాక్ ఖోఖో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సెయింట్‌పాల్ హైస్కూల్ హైదరాబాద్‌లో నిర్వహించిన ఖోఖో సెలక్షన్, ట్రయల్‌లో అండర్ 17 బాలికల విభాగంలో గుమ్ముల శైలజ, ఆరెపల్లి వర్షిణి, బాలుర విభాగంలో సలిగంటి గణేశ్, ఇందూరి సంజయ్, అండర్ –14లో నలిమేల అజయ్‌కుమార్ ఎంపికయ్యారు. వీరు ఈ నెల 7, 8 తేదీల్లో రాజస్థాన్‌లోని దుదునగర్‌లో నిర్వహించే నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. వీరిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## జాఫ్రాపూర్ పాఠశాలకు విరాళం

సోన్, అక్టోబర్ 4 : సోన్ మండలంలోని జాఫ్రాపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలకు విద్యార్థుల అవసరాన్ని గుర్తించి గ్రామానికి చెందిన ఎన్నారై షేక్ అహ్మద్ రూ. 25వేల విలువ చేసే స్కానర్, జిరాక్స్, ప్రింటర్ మిషన్, బ్యాండ్ సెట్‌ను విరాళంగా బుధవారం అందించారు. విరాళం అందించిన షేక్ అహ్మద్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తొడిశెట్టి పరమేశ్వర్, ఉపాధ్యాయులు నగేశ్‌కుమార్, ముత్తన్న, మసి యొద్దీన్, విజయమాల, విజయలక్ష్మి, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక సేవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని పేర్కొన్నారు.

## ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



డీఈవో రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 4 : ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి బదిలీలు చేపట్టాలని కోరుతూ పలు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం డీఈవో కార్యాలయంలో డీఈవో రవీందర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయాలంటే ముందుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి బదిలీలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, శ్రీనివాస్, బ్రహ్మయ్య, రాజేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దవాఖానలో చెడిపోయిన వస్తువుల వేలం

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 4 : నిర్మల్ ప్రధాన దవాఖాన, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చెడిపోయిన వస్తువులను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వేలం వేయనున్నట్లు వైద్య కళాశాల సూపరింటెండెంట్ సునీల్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5 న ఉదయం 11 గంటలకు జిల్లా ప్రధాన దవాఖానలో వేలం వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.



దగ్ధమైన వ్యాన్

## వ్యాన్ దగ్ధం

నర్సాపూర్(జీ), అక్టోబర్ 4 : మండల కేంద్రంలోని స్థానిక పెట్రోల్ బంక్ వద్ద బుధవారం సాయంత్రం ఆగి ఉన్న ఓమ్ని వ్యాన్‌లో నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. నర్సాపూర్‌కు చెందిన రాజు వ్యాను దగ్ధమైంది. స్థానికులు, యువకులు మంటలను ఆర్పడానికి ప్రయత్నించినా అదుపులోకి రాలేదు.

## ఘనంగా అంతర్జాతీయ జంతువుల దినోత్సవం

నార్నూర్, అక్టోబర్ 4 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అంతర్జాతీయ జంతువుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మహేందర్ పర్యావరణ పరిరక్షణలో జీవరాసుల ప్రాముఖ్యత, జంతు సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం జీవశాస్త్రం అధ్యాపకులు శివప్రసాద్‌ను శాలువాతో సన్మానించారు.